మనిషి తప్పు ఎందుకు చేస్తాడు? అందునా తెలిసి మరీ ఎందుకు చేస్తాడు? మార్గాంతరం వుండకపోవచ్చు. బయటపడే ఉపాయం లేకపోవచ్చు. అందుకు సమయం మించిపోవచ్చు. ఏమైనా బలవత్తరమైన కారణమే వుంటుంది. అంతేకాని స్వతహాగా మనిషి చెడ్డవాడని చెప్పడానికి మాత్రం వీలులేదు.

పొద్దున్నే లేచి ఎవురి మొహం సూశాను?

ఆఁ... సిలకపచ్చ రంగు కోక కట్టుకుని పోయింది. ముసుకేసికొని, ముండమోసింది కాదుకదా! కొంపదీసి... కాదులే! ముహాన ఇంత పెద్ద బొట్టుందిగా! ముత్తయిదుబొట్టు. అబ్బ!

పొద్దు పొడిసిందో లేదో గుడగుడ... అప్పుడే ఆకలి! రాత్రే కదా తిన్నది... మళ్లీ ఆకలి. పాడు పొట్ట. చేతిలో డబ్బుందీ లేనిదీ దీనికెందుకు? దీనికోసం ఎన్ని కట్టాలు?

ఆకలి లేకపోతే ఏ పోలీసోడ్ని సూసీ భయపడే పనేలేదు. తీసికొనే మామూళ్లు తీసికొంటానే బెదిరిత్తారు-వాళ్ల తాతగాడి సొమ్ము ఎగ్గొట్టినట్టు...

అబ్బ! ఆకలి!

ఇప్పుడెలా? పాడు జల్మ-ఏ రోజుకారోజు తిండి కక్కుర్తి. రోజు గడవటమే ఒక గండం. ఆదుంచినా బాండ్ను... యాలకింత పడేద్దురు. ఛీ! ఎదవబతుకు!

# గాజు కిటికీ



తాడిగిరి
పోతరాజు

ఇకనుండైనా బాగా బతకాలి!-ఈ రోజుతో ఈ పని మానుకోవాలి.

ఏడుకొండలవాడా! అంతా నీ దయ-నీవు సల్లగ సూసి రెండో కంట బడకూడదు.

సామీ నీ మేలు మరసిపోను-ఈ ఒక్కసారి కాపాడు. మళ్లీ ఈ పని సేత్తే ఒట్టు... ఇయ్యాల సామి దయ కలిసొత్తే కావు సారాయి కాసుకొని బతకాలి-లేకపోతే ఏం బతుకు నీయవ్వ! రెండు రోజులీడరెండు నెల్లు ఆడ. పట్టుబడ్డరోజు సున్నంలోకి ఎముకలు మిగలటంలే! కావు సారాయికేం గిరాకీ! దీని తల్లి సిగదరగ-రాములమ్మ ఆడది. కావుసారాయి మీద ఏం సంపాయించింది! కాలుమీద కాలేసుకొని మగసిరిగా బేరం అమ్మింది. ఆ డాబాలు రెండూ దానిమీద కట్టించినయ్యేగా! రాత్రి మటుకు రాత్రి-అరకాయ బోసింది, ఆరురూపాయలు తీసికొంది-అన్యాయంగా వచ్చిన సొమ్ము నిలవదంట-నోటికడ్డం వచ్చిందల్లా వాగుతారు బుద్ధితక్కువోళ్లు. నాయం-అన్యాయం -వోడు సూత్తన్నాడు! పోలీసోడి కంటబడకుండా ఎన్నిసార్లుసైకిలు టూబుల్లో దానికి సారాయి దేలా? ఇప్పుడొక సుక్క అప్పు బొయ్యమంటేససేమిరా సోటుబెట్టదునాయమంట నాయం! ఈరోజు మన నచ్చత్రం మంచిది కావాలి. ఒక వచ్చనోటు గిడితే దానికి యక్సపోర్టీ.

సరే, అయన్నీ దొరికినవ్పటి ముచ్చట్లు. దొరక్క యాడికిపోద్దీ? రేపటి నుండి గల్లాపెట్టి ముందు కూసోవాలి.

ఆ ఎన్నిసార్లు ఇట్టనుకోలా? అదీ నిజమే. దీని తల్లి సిగదరగ-పాడుబుద్ధి! దానికంటే కోతి నయం. ఒకప్పుడు కాకపోతే ఇంకోప్పుడు ఒక సోట కాసుంటది. కానీ డబ్బు సేతికి సిక్కిందా ఒకపాట... సిక్కినాక... కానీ ఇయ్యాలమాత్రం అట్టాకాదు.

సరేలే. ముందైతే పని కానిద్దాం. తరువాత యాపారం సంగతి. అరెరే! సూత్తా సూత్తా పొద్దు రెండు బారలెక్కింది. అబ్బ ఒళ్లు గొడ్డలి మడిమతో సరిసినట్టుంది. ఒక్క సుక్క పడితే ఒళ్లునొప్పులు సల్లొదులు... కానీ సుక్కకు డబ్బుంటే ఈ కట్టమెందుకు-అయినా సుక్కెందుకు? సుక్కబడితే పనిసాగదు-ఆయాల కూడా ఇంతే. సుక్క మూలానా సిక్కిపోవాల్సొచ్చింది.

ఇప్పుడెటు?

టేషన్కా? బస్సుటాండుకా?

టేషన్ చాలా దూరం నడవాలి -ఇప్పుడే కాళ్లు పీకుతున్నాయి.

వాడు ఆ రిక్షాలో పొయ్యేవాడు. ఆయాల అన్యాయం సేశాడు. ఒకటీ అరా కాదు-మూడు గొలుసులు-ఒకటి చంద్రహారం-రెండు నక్లీసులు. ఇంకేదైనా అమ్మసూపితే యట్ట లేదన్నా ఆరొందలు బలుకు-మూడూ కలిపి. రెండొందలు కొట్టేశాడు.

శైనా యుద్ధం మూలంగా బంగారు కొన్నా అమ్మినా బేడీలు బడుతున్నాయంట-శైనావాళ్లు రాకముందు మాత్రం ఇచ్చిసచ్చిందేముంది? తలలు తీసి తలలు మార్చేరకం. వాడి గీత మంచిదై యాపారం బాగా కలిసొచ్చింది.

"ఏయ్ కూలీ! వస్తావా?"

యాడ? ఎవురు?

"బాబుగారో. వత్తానండి. పెట్టె-బెడ్డింగు-బస్సుమీద ఏపియ్యమంటారా? బాగా బరువుంది. ఒక పావలా డబ్బులిప్పించండి."

"బేడ ఇస్తారా!"

నాయానికి రోజులు కావు. సిన్న కాయితం మీద సంతకం చేసేది-వందలొందలు లంచాలు

**20.11.1963 సంచికలో**
**ప్రచురితమైన ఈ కథ ఆ ఏడు**
**దీపావళి కథలపోటీలో**
**ద్వితీయబహుమతి పొందింది**

నూకుతారు. పొద్దత్తమానం ఎముకలిరగ్గొట్టుకొన్నా రూపాయి డబ్బులివ్వరు. మన వనే హాయి. గిట్టుబాటైతే మారాజులా తిరగొచ్చు.

"ఏయ్ కూలీ! సరే తీసుకో."

అట్ట దిగిరా నాయాలా! ఎవుడవసరం? తేరగా వడివున్నామా నీ సామాన్లకోసం? అబ్బ మెడలిరిగిపోతున్నాయిపో! రోజూ మోసేవాళ్లు ఎట్ట మోత్తారోగాని... ఏం చేత్తారు పావం!

పావలా.

పావలా అంటే నాలుగుసింగల్ టీలు.

ఒక కట్ట హస్తం బీడీలు.

ఇంకొక అణా కలిపితే ప్లేటు బోజనం.




ఇంకా... ఇంకా,,, కానీ. ఇప్పుడు మాత్రం ఒక బేడ వునుకులు, ఒక సింగల్ టీ, ఒక అణా బీడీలు. అంతలో బస్సుల చుట్టూ జనం పోగవరు. ఎనిమిది దాటితేనేగాని తోసుకోరు. అప్పుడు... అప్పుడు పొయ్యిద్దాం.

"ఏం అయ్యగోరూ, ఒక బేడ వునుకులిచ్చి, ఒక సింగల్ టీ కలువు. టీస్టాల్ పెద్దది చేశావే, బేరం బాగా గిట్టుబాటుగా వుందా?"

యాడసూసినా అరవోళ్ల వోటళ్లే! బతకనేరిసినవోళ్లు. మనం ఇంకోదేశం పోయి బతకటమా? బతకలేం. అందుకనే దరిద్రం. ఈడ తాగటానికి గంజి లేకపోయినా, ఈడ్నేవడి సత్తామంటారు.

"ఏమయ్యోయ్! టీ డబుల్ స్ట్రాంగ్."

అరె చాన్సు పోయింది. గుంటూరు బస్సు టాండింగులోకొచ్చింది. జనం ముసురుకుంటున్నారు. ఇవ్పటిదాకా ఈళ్లందరూ యాడున్నట్టు? అతను-అతను-లాల్చీ వక్కజేబులు బరువుగా వున్నాయి. వల్లెటూరోడేనా? వును. ఏ కలప కొంటానికో, పొగనారు కొంటానికో గుంటూరు ఎక్కుతున్నప్పుడే పని కానియ్యాలి. మనిషి లోవలికెళ్లినాక అనుకుంటే లాభంలేదు. అతడు ఒక చేత్తో కడ్డీ పట్టుకుని యాలాడబడతాడు. ముందు ఒక కాలు చెక్కమీద పెట్టి, ఇటువంగి రెండోకాలు తీసుకునేటవ్పటికి పనైపోవాలి. ఇక అనుమానమెందుకు? లే...

"ఏమయ్యో అయ్యరూ. నీవు టీ తెచ్చేలోకే పొద్దుటాట ఒక సినిమా సూసి రావచ్చే!"

తొందరవడకూడదు. తొందరవడితే వని పాడైపోయిందే. గ్యారంటీ. బస్సులో జనాన్ని దిగనియ్యి ముందు. వాళ్లు దిగేలోగా టీ తాగి అవతల వడదాం. అతనొక్కడేనా? ఇంకా... ఇంకా...

"అయ్యరూ, ఇదిగో గ్లాసు. అణా తే."

"ఊ వెధవ లారీ. పోనియ్యి."

"ఒక అణా హస్తం బీడీలు. అర్జంటు!"

"తోసుకోకండయ్యా. బోలెడంత ఖాళీ వుంది."


అరె అతనెటుబొయ్యాడూ?-కళ్లల్లో కారం గొట్టాడే! తళుక్కున మెరిసి మాయమయ్యాడే! ఓహ్... గోతాలు టాపుమీద ఏపిత్తన్నావ్? సరే రా...

"ఎక్కండమ్మా. ముందు ఆడవాళ్లెక్కండి. ఆగండయ్యా. ముందు నిలబడ్డవాళ్లనెక్కనియ్యండి." అరె-అరె-కడ్డీ పట్టుకున్నాడు. మనంకూడా... ఊఁ... ఇటు... జేబు... వక్కజేబు... కాదు చెయ్యి-మొద్దుచెయ్యి-ఎడంచేత్తో జేబు గట్టిగా పట్టుకుని ఎక్కుతున్నాడు. తప్పించుకున్నావ్ గదరా! కత్తెర

## నీలాంబరి పాట్లు!

క్రొత్తతార నీలాంబరి. ఆమె నటించిన చిత్రం 'బాచి' కాస్త రంగు తక్కువగా వుంటుందీ అమ్మాయి. జగపతిబాబుతో ఆడీపాడి సినీవినీలాకాశంలో తళుక్కున మెరసిన నీలాంబరికిప్పుడు మళ్లీ చిత్రాల్లో అవకాశాలు రావడం లేదట. అందరినీ తనను తీసుకోమని అడుగుతుండటమే పనైపోయిందట. ఎవరో ఓ నిర్మాత, "ఆ, నువ్వు బాగానే కనబడుతున్నావు, కానీ కాస్త ఎక్స్‌పోజింగ్ చేయగలవా? అలాగైతే నా చిత్రంలో నువ్వు ఖాయం" అన్నారట. ఆమె పాపం అమాయకంగా " 'బాచి'లో కూడా ఎక్స్‌పోజింగ్ చేశానండీ. ఓ మంచిపాత్ర చేయడానికి అవకాశమిస్తే మీరు కోరినట్లుగా చేస్తానండీ" అందిట. మరి ఏమాత్రం వెలుగుతుందో చూడాలి.

ఎన్.



తెచ్చుకోవాల్సింది. కత్తెరుంటే? కత్తెరున్నా ఒంటిపాటున మనిషి నిలబడాలి. మంచి ఛాన్సు పోయిందే... పోయిందంటే మన తప్పేముంది?

పల్లెటూరోడైతేనేం? గుంటూరు, బెజవాడలో జేబులు కొడతారని బాగా ఇనుంటాడు. ఎంత ఇంటే మాత్రం యేం? ఒక సేత్తో ఈ కడ్డీ పట్టుకున్నట్టు, ఆ సేత్తో అవతలేపు కడ్డీ అందుకున్నట్టయితే, వాలు జిక్కు... తప్పించుకున్నాడు లేసి ఎవురి మొహం చూశాడో!

అది కాదులే... మనకే ఈడ శకునం బాగాలే. అటు టేషన్‌కన్నా పోదాం.

అబ్బ-పాడుగవులు-రాత్రి తిన్నా కూడు బయటికొత్తది. మాంచి సిమ్మెంటు రోడ్డు దిగి దగ్గర దోవని ఇటొత్తినే... ఈడ రోజు వుండేవాల్లెట్టా బతుకుతున్నారో? ఓరి దేవుడా! గుడిసెమీద గుడిసె! వానాకాలం సూడాలి ఈళ్ల బాగోతం. రొచ్చు, గబ్బు, ఆడ్నే కూసుంటారు. ఆడ్నే తింటారు. పందులూ, ఈగలూ మనుషులకు తేడా లేదు. ఏ ఏడు గెత్తరొచ్చినా ఈ గుడిసెల్లోంచే మొదలు. పోయినేడు మడశానికి యాభై పీనిగలెల్లినాయి. అయినా గుడిసెలొదిలి పోరే!

యాడికి పోతార్లే!

వాళ్లకేం, ఇల్లా వాకిళ్లా? రెక్కాడితే గానీ డొక్కాడదు. తెల్లారగట్ట లేసి ఇంత కాసుకుతాగి, ఆ కుండా, ఆ బొచ్చా ఆడ పారేసి, పాట్ట సేత్తో పట్టుకుని కూలికిపోతారు. రాత్రికొచ్చి ఆ గుడిసెల్లో పడుంటారు. చావొచ్చేదాకా ఆ మురికిలోనే పడుంటారు. ఇస్త్రీ గుడ్డలేసుకునే పెద్దమనుషులెవరూ ఇటుకెల్లిరారు. తెల్లటోపీలు బెట్టే మంత్రులు మీటింగు సేసి మాట్టాడుతారు-ఆ గుడిసెల్ని లేపాలని, పోలీసుల్ని పంపి.

ఎటు సూసినా బొయిమని ఈగలు! ఎవుడో పందికొక్కుని సంపి ఈడ పడేశాడు.

"ఏయ్ రిక్షా! కళ్లు నెత్తిమీద బెట్టుకుని తొక్కుతున్నావా?"

చచ్చీ చెడీ రిక్షా తొక్కుతాడు నెత్తురుబడేట్టు. ఇద్దరు ముగ్గుర్ని ఎక్కించుకుంటారు. ఏం లాబం? పొద్దున్నే ఓపెనింగు. సాయంత్రం క్లోజింగు. బూతద్దంలో సూసి మరీ ఐడియా ఏత్తారు.

ఆ సారతీగలల్లుకున్న గుడిసెలది... అది సాంబ్రాజ్యానిది-అవును. ఇప్పుడేడుందో? కప్పు బాగా లేసిపోయిందే! మొత్తానికి మడిసి మంచిది. ఆ పనిలో ఉండాల్సింది కాదు. ఆ ఎవుడు కోరుకున్నట్టు వాడు బతికితే ఇదంతా ఎందుకు? పాపం డబ్బులేని రోజుకూడ ఒంటిమీద సెయ్యెయ్యనిచ్చేది. పోలీసులు పట్టుకెల్లారని ఏడిసిందంట. సామి దయతో కాపుసారాయి బేరం గిడితేదాని సేతిమీదగానే అమ్మించాలి....

ఆరి నీయవ్వ! ఇటుదాక రేకులు కొట్టారే టేషన్‌కి? ఆ గుంటూరూ బందరు లైన్లు ఇటు జరిపినట్టుంది. టికెట్టు తీసుకునే తెల్లకోటు మనిషి... ఆడొకడు... ఈడొకడు... మెట్లకాడ్నే కూసున్నారు. లోపలికి పోవటం... వీల్లేదుచిక్కే వచ్చింది! బుకింగు రూముకెల్లిపోదాం మరి. ఇక్కడెవురు దొరుకుతారు నాపసన్నాసులు! కుంటి-గుడ్డి-అడుక్కుతినే నాయాళ్లు పడుంటారు బెంచీలమీద. ఆలోసించటం దేనికి? రెండడుగులేసి ఒక దెబ్బ సూత్తే పోలా?

"బాబూ ఒక పైసా యెయ్యి దొరా! అయ్యా నీ కాళ్లు మొక్కుతా!" అనుకున్నట్టే-అంతా అమాంబాపతు! ఈడ పడిగాపులు కాసే పాసింజర్లు కూడా వీళ్లకు తోడుబోయినవాళ్లే-తిండికీ తిప్పలకీ నకనకలాడి కొంప చేరతారు.

ఇంకా హైద్రాబాద్ బండికి బుక్కింగు తియ్యనట్టుంది! టైం? ఎనిమిది కాలేదు. బుక్కింగ్ తెరిసేలోగా ఒక రౌండు గొడదాం.

ఆ... ఆడమనిషి. పిల్లలకు సద్దిబువ్వ పెడుతోంది మామిడికాయ పట్టడేసి. మెడలో గొలుసులు బంగారమేనా? అయినా పట్టపగలే. కాదులే. ఆ మూల బెంచీమీద ఉన్నవాళ్లు... ఆయన బడి సెప్పుకునే పంతులు. ప్చ్! నలుగురాడపిల్లలు. గూడమీద లాల్చి కుట్టించుకున్నాడు. ప్చ్! ఇటున్న మనుషుల్లో...

అడు మరుగుదొడ్లు. వాటికి ముందు బెంచీమీద... ఆ కాళ్లు... ఆడమనిషా? మగమనిషా? సాటుగా పడుకొన్నాడే! మామూలు బట్టలు మరి సాటుగా, ఉచ్చులు బోసేకాడ ఎందుకు పడుకున్నాడే? జేబుమీద సెయ్యిబెట్టుకొని!

ఎనిమిది కావచ్చినా, దొర, నిద్ర లెగవలా? రాత్రంతా నిద్రబట్టివుండదు-డబ్బు! డబ్బుంటే నిద్రకూడా రాదు. దీని తల్లి సిగదరగ! మనిషిని చేదగ్గులా పీలుసుద్ది డబ్బు. మరి గుడ్డల వాలకం సూత్తే... గుడ్డలేసుకుంటే పైకం పసికట్టదని ఎత్తు. ఈ ఎత్తులు మనకాడ్నా?-ఇంతకీ ఆ సేతికింద డబ్బుందా? ఊరికినే పడుకొన్నాడా మరి? సెయ్యితీత్తేగానీ తెలియదు.

"ఏమయ్యో! జరుగు, కొద్దిగా కాళ్లు ముడుసుకో. ఇంత పొద్దెక్కినా నిద్ర సరిపోలా?"

రాత్రి రెప్పపాటులో బండి తప్పిపోయిందా? రాత్రంతా కళ్లమీద కునుకు లేదా? తెల్లతెల్లారంగానే కన్నుమూశావా? అవున్లే డబ్బు-డబ్బుంటే నిద్రబట్టి చావదు.

ఓస్... నల్లటిపర్సు... ఎంత లావుంది! పెద్దపర్సు... వందలు... వేలు కాదుకాని... వందలు సందేహం లేదు. దక్కించుకోవడం మన సేతిలోపని. ఆ బస్సుటాండులో ఏముంది మన్ను? అంతా సామి దయ-సామి మొక్కు తీరుసుకోవాలి.

"మంచిది, పడుకో, పెద్దమనిషిని. ఏమీ లేదు. కొద్దిగా కూకొంటానికి... పడుకో-పడుకో."

పదినిముషాలు కానిద్దాం. ఇంతలో మళ్లీ గుర్రు కొడతాడు. అప్పుడు... అప్పుడు... సిన్నగా జేబుమీద ఏసుకున్న సేతిని జారగొట్టాలి. మోచెయ్యి వాలుగాబెట్టి ఆ పని సెయ్యాలి. కుడిచెయ్యి భుజంమీదుగా పోనిచ్చి, ముందు రెండువేళ్లతో అంటీఅంటనట్టుగా లాగాలి. ఆ తరువాత ఎలా?

రెండో మనిషి కావాలి. మనం కూసున్నసోటు నుండి ఒక బెత్త అటూఇటూ జరగకూడదు. అవసరం లేనప్పుడు పతినాయాలూ వూరికినే కనబడతాడు. అసలు యాదొచ్చినప్పుడు నల్లబూసలైపోతారు. ఇప్పుడెట్టా? మనిషి కోసం బోతే అసలోడు లేసి అవతలబడితే...

"ఒరేయ్ యాపుల్లలూ! ఇటురా. నేనురా-నన్ను

మరిసిపొయ్యావురా?"

ఏ అమ్మ కులం సెడి కనిపారేసిందో? అడుక్కుతిని, పుల్లలమ్ముకొంటూ ఈ టేషన్‌లో పండుకుంటాడు.

"అటు పోదాంరా రేకులపక్కకు."

ఈడ్నయితే ఎవరూ అనుమానపడరు. సెప్పింది సెప్పినట్లు సేశాడంటే మన దరిద్రం తీరుద్ది.

"నీవు నా పక్కన సిమ్మెంటు బెంచీకానుకొని నుంచో, తెలిసిందా? పక్క జేబుందా?... అంతే... యాడ ఆగకుండ, ఇంజన్లు నీలు బోసుకొనేకాడ బొగ్గుకుప్పల నీడకుపో. సరేనా? అట్టైపోయిరా!"

పదినిమిషాలు అయినయ్యా? తొందరపడకూడదు. పదినిమిషాలైనా వాడు గట్టిగా బుసగొడుతున్నాడో లేదో సూడాలి. అప్పుడు.

ఇంతకీ ఆ పర్సులో పందలున్నాయా? ఉన్నవో లేవో కొట్టేనాకగానీ తెలియదు. ముఖం సెమట పట్టేందిలో మళ్లీ. నోరుకూడ సన్నగా తెరుసుకున్నాడు సచ్చినోడులాగ. ఇక కానియ్యి. ఎవడన్నా సూత్తన్నాడేమో! ఒకసారి ఇట్ట బయపడితే ఇక పనైనట్టే. ఎనకాముందు సెయ్యటం అసలు ఈ పనికే తగవు.

బయమా? మన జన్మలో బయపడమే పోలీసోల్లొచ్చినా సరే! మరి ఇంకేంది? ఎందుకైనా మంచిది ఆలోసిచ్చి సేత్తే? ఆలోసించు... అసలు పనికంటే దీనితోనే ఎక్కువసావు. ఈలోగా అసలోడు లోపనేలేత్తాడు. అదీ నిజమే. మరింకేంది అనుమానం? అనుమానం కాదుగానీ ఏద్దైతేనేం పని సెడగొట్టడానికి? పని కానిచ్చి ఆలోసిద్దాం. సరే ఎవుళ్లయినా సూత్తన్నారా? ఆ ఆడమనిషి పిల్లల సేతులు కడుగుతోంది. వాళ్లకీ సిమ్మెంటు గోడ అడ్డం. అటువాళ్లకు దిమ్మెలడ్డం. ఇటు మరుగుడుదొడ్లు. ఈ పక్క బుకింగు రూం. ఇక కానిద్దాం....

సెయ్యి మెల్లగా... అయిపోయె... మెల్లగా... బరువుగానే వుంది. ఎవుళ్లయినా సూత్తన్నారా? ఎందుకు సూత్తారు? మన అనుమానంగానీ. ఎవళ్లరలో వాళ్లుంటారు. ఈ మాత్రం దానికి పెద్ద హంగామా. ఏమైనా కదులుతున్నట్టా? ఏమీలేదు. మనలోకంలో లేడు. కరువుబట్టినట్లు నిద్రబోతున్నాడు.

ఏమో నమ్మిందెవుడు? ఒకవేళ లేత్తే? ఈ పిల్లగాడేడీ? నమ్మి సెడితినే. పిల్లగాడెందుకు-లేసిపోతే... ఆ వత్తన్నాడులే! పక్కకు జరుగుదాం. కూసోబెట్టి పక్కజేబులో బెట్టాలి.

"ఏరా! ఎన్ని పుల్లలమ్మావ్? రెండు యాపపుల్లలిటుతే... ఇక పో."

మన పొరంతిలో లేడు. నా సామిరంగ! రోజూ ఇట్టాంటి మనుషులు దొరికితే, నెల దిరక్కముందే మేడకడుదుం. లేసిపోదాం. యాడా మనిషి దూరటానికి సందులేకుండా కొట్టారే రేకులు! చిన్నపిల్లగాళ్లే గానీ మనం దూరలేం. బారుకు నడిసిపోయి వాడ్నే బయిటికి పిలుద్దాం. వాడున్నాడో లేకపోతే... మనకు మస్కాగొట్టి వాడేడికి పోతాడులే ఈ ఊళ్లో! ఆ పప్పులు మనదగ్గర్నా ఏమో డబ్బు... డబ్బు సూత్తే పెద్దోళ్లే అబద్దసాచ్చాలు సెబుతారు కోర్టులో. ఆ... ఉన్నాడులే సైగసేసి, ఇటు పిలుద్దాం.

"ఏందిరా బొగ్గుకుప్పలో బెట్టావ్? సరే తీసకరా."

"బాగా దొరికావురా నాకు. ఎవుడూ అనుమానపడకుండా బొగ్గుకుప్పలో దాశావ్? ఆ నలుపూ ఈ నలుపూ కలిసిపోతాయిలే. తెలివిగల వాడివే. ఇటు తేరా!"

ఎవుడన్నా సూత్తన్నాడా? సూత్తేనేం ఈ పర్సే నాది కాదనటానికి దమ్మెవడికుంది? పొడుగుమాత్రం బాగానేవుంది మూడుమడతలతో. ఓరీ నీయవ్వ! ఇది రైల్లో యాలంపాట పాడేది. ఎవడో బిల్లరేసి ఈడికి అంటగట్టి వుంటాడు! పర్సు అణాకానీదైతే మనకెందుకూ? ఈ క్రింది అరలో కార్డు, టిక్కెట్టు.

అరె! సచ్చీసెడీ యింతపని సేత్తే కట్టమంతా ఊరకనేబోయె. ఇదిలితే మట్టుకు... ఏముంది? బొంద! పర్సుమాత్రం ఇంత పొడుగున వుంది. ఒక సేరు సెనగపప్పు పోసుకోడానికి. ఈ మూల సినిగిపోయిసోట దారపుకుట్లు. ఈడేమన్నా తీసుంటాడా? అంత దయిర్నమా? ఐదురూపాయల కోసం అయిదొంద శాకిరి సేత్తిమే! చా! మన హయాంలో ఎరగం ఇంత పొరపాటు పని! సరే, మనం అనుకున్నట్టు జరిగితే మారాజులం కాకపొయ్యేం?

ఇంతకీ ఈ పిల్లనాయాలుకెంత ఇద్దాం? వాడికి మనకులానే ఆశ. ఆ సూపు సూడు ఇత్తానో ఇయ్యనో అని అనుమానంగా సూత్తన్నాడు. సిల్లర లెక్కసూడదా? అంటే సూసి గుప్పిట్లోనే వుంచుకున్నాడు. వాడి బాగం అంతకన్న వుండదనే వాడి నమ్మకంపిచ్చినాయాలు!

"ఒరేయ్, ఆ సిల్లర నువ్వుంచుకో."

కడుపు లోపలికి పోయింది. ఎప్పుడు తిన్న తిండో? రైలు టేషన్లో ఎంగిలాకులేసే కంతలో సెయ్యిబెట్టి మెతుకులు ఏరుకుంటాడు. వాటిని మాత్రం ఈడికి దొరకనిత్తారా? తోసిపారేత్తారు. తిండి లేక ఎదుర్రొమ్ము ఎండుకుపోయింది. ఆ తలమీద బొచ్చు నూనెలేక రాగిబొచ్చయింది. ఆ కాకీ నిక్కరు. పిర్రలమీద బారుకు సిరిగిపోయింది.

ఇంకొక రూపాయిద్దాం. ఈయాలన్నా కడుపునిండా తింటాడు. అయితే మనకు మిగిలేది! నాల్గురూపాయలేగా? మరి... మరి? దీనికింకా ఎనకాముందెందుకు-ఒక రూపాయికాడ-ఎదవది! మనం ఇయ్యాల కాకపోతే, రేపు సంపాయిత్తాం. వాడికి అడుక్కున్నా పందమంది పైసలిత్తేగదా? ఇట్ట జేబుగొడితే 'మన మేనాడో బాకీ వాడికి' అనుకుంటారు. కానీ, వాళ్ల సేతిమీదుగా ఒక పైసా ఇయ్యడానికి సత్తారు!


"ఒరేయ్! ఈ రూపాయికూడా తీసుకో. ఇదిగో! రేపు సేతికి తడి తగిలితే గుడ్డలు కుట్టిత్తాలే."

మరి ఈ ఎదవపర్సు ఆ బొగ్గుకుప్పల్లోకి ఇసిరితే? ఇసరకపోతే? ఎవుడకన్నా ఇత్తే

## బొద్దుగా వుంటేనే ముద్దట!

ఇదేదో కొత్త మంత్రంలా వుందికదూ? 'మంత్ర' అనే నటి చెప్పినమాట ఇది. ఈ మంత్రెవరో కాదు, మనకు రాశిగా చిరపరిచిత అయిన అందాలరాశే తమిళసినీజగత్తులో మంత్ర. జెమినీటీవీలో ఆంకర్‌గా ప్రవేశించిన రాశి క్రమంగా సినీరంగపు మెలకువలు నేర్చుకుని హీరోయిన్ అయి వెలుగుతూంది. "తెలుగురంగంవారు సన్నగా మెరపుతీగలా వుండే అమ్మాయిలను మెచ్చితే, తమిళులు కాస్త లావుగా బొద్దుగా వుండే అమ్మాయిలే తమకు ముద్దంటారు. అందుకే తెలుగు చిత్రాల్లో చేయాలంటే డైటింగ్ చేసి సన్నబడిపోతుంటాను. తమిళంలో చేయాలంటే కాస్త ఎక్కువగా తిని బొద్దుగా వారికి నచ్చినట్లుగా తయారైపోతుంటాను" అంటూ అందంగా చెప్పి దరహాసాలొలకబోస్తుంది రాశి. బాగుంది ఎక్సర్‌సైజు!

ఎన్.



## పాటలు పాడను, నటిస్తా!

అంటున్నారు మన మెగా సింగర్ బాలసుబ్రహ్మణ్యం. అది విన్న జనం అదిరిపడిపోతున్నారట. తనను తమ చిత్రాలకు పాడమని అడుగుతున్న నిర్మాతలతో ఆయన "అబ్బే, పాడటం కాదులెండి, ఏదైనా మంచి వేషం వుంటే చెప్పండి చేస్తా" అంటున్నారట. తాము సరిగ్గానే విన్నామో లేదోనని వారంతా అయోమయంలో పడిపోతున్నారట. ఇక కొందరు తెగించి "అదేమిటి సార్, మీరు నటించటమేమిటి? వీనులవిందుగా పాడాలిగాని!" అంటే, ఆయన "మీ దృష్టి అంతా భాష తెలియని, భాషను ఖూనీచేసేవారి మీదే వుంది కదండీ! మరిక నేను పాడినా మీకు నచ్చుతుందా? అయినా మీకు నచ్చేలా నేనేం పాడగలనులెండి! నా మీది అభిమానంతో నాకో మంచి పాత్ర ఇవ్వండి, చాలు" అంటున్నారట. కథ ఇలా అడ్డం తిరిగిందేమిట్రా? అని అందరూ తలలు పట్టుకూచుంటున్నారట. మరి బాలు వేదనను అర్థం చేసుకునేవారెవరైనా వున్నారా?

ఎస్.



బాగున్నాడు! తలకు మాసిన నాయాలు ఐదురూపాయలకు కూడా పెద్ద పన్ను! ఇంతకీ ఏ ఊరికెళ్లామని బయలుదేరాడో? ఇక ఒకటే ఊరు... నెత్తిన సెంగేసుకుని వచ్చిందోవనే ఎనక్కి. అదె! హైద్రాబాద్! లేసి సూసుకొని లబోదిబో!

ఈ కార్డు అబ్బ! ఏం రాత సవాలచ్చ వంకర్లు! ఈ రాసినోడికంటే మనమే నయం రాతకు... "దుక్కిబోయిన చినరామయ్యకిచ్చేది." ఏందో సదివి అవతలబడేద్దాం. ఈ మొదట రాసిన అచ్చరాలు ఏందీ-గొలుసుకట్టే-సరేలే.

"నమస్కారములు చేసి వ్రాయునదేమనగా మన తల్లి పాణం బాగులేదని లోగడ రాయించితిమి. ఆ సంగతే మళ్లీ రాయించుతున్నాము. అమ్మకు పచ్చవాతం మూలకంగా కాలూజెయ్యీ పడిపోయి మంచాన బడింది. నిన్నటినుండి నోరుకూడా పడిపోయింది. నోరున్నప్పుడు నిన్ను సూసిసచ్చిపోతాను; ఉత్తరం ఏపియ్యమని సెప్పింది. అమ్మ ఇక రోజుల్లో మనిషే. నీవు గ్యాపకం వచ్చినప్పుడల్లా మమ్ముల్నందర్నీ సూసి తల అటూఇటూ కొట్టుకొంటుంది. అమ్మ సివరిరోజుల్లో అందరమూ వున్నాం. నీవు ఒక్కడివే లేవు. నీవు ఉత్తరం ముట్టినవెంటనే బయలుదేరి రా! లేకపోతే నీకు సూపు అందదు. ఈయాల నీ చార్జీకోసం పదిహేను రూపాయలు మనియాడరు కట్టినాము. నేను పదిరోజులపాటు దొరదగ్గిర సెలవు అడిగి అమ్మకాడ్నే వుంటున్నాను.

"ఇట్లు

"చిన్నతమ్ముడుకొండయ్య వ్రాలు."

ఇదుగో మనియాడర్రసీదు. పదిహేను రూపాయలు టికెట్టుకు పోగా మిగిల్నయిదు రూపాయిల సిల్లర. కన్నకడుపు! ఆ ముసిల్దాని పాణం ఎంత కొట్టుకులాడుతుందో? ఎంతపాపాకారాని కొడిగట్టాను-పొద్దుపొద్దున్నే! నీ యవ్వఎంత పాపం సేసుకున్నానో! ఆయాల అమ్మ వచ్చేయాలకు జైల్లోపడివున్నా. 'కొడుకా! కొడుకా!' అని కొట్టుకులాడి పాణం ఇడిసిందంట. నా మీద దిగులేసుకుని, సేదగ్గు తెచ్చుకుని సచ్చింది. పాడుజల్మం! ఎంతమందినిట్టా తల్లీబిడ్డలను ఏరుసేశానో! సచ్చేటప్పుడు నికుట్టవు సావు సత్తా! వాళిక పీక్కుపోతున్నా సుక్కనీరు గొంతులో పోసేవాడు లేక దావాద్రితో సత్తా!

ఈయాల ఈడు బండికెల్లకపోతే ఆడి ఉసురు నాకు తగులుద్ది. ఎట్టా... టికెట్టుగూడా యిందులోనే దాసుకున్నాడే! టికెట్టు వుంటే మాత్రం అవతల పోటానికి? ఎదవది, పాడుత్తరం సదవకపోయినా బావుండేది. మనస్సు సివుక్కుమన్నది.

సదివితే మాత్రం వాడి డబ్బు వాడికియ్యాలని యాడుంది? పెపెంచంలో ఎన్ని అన్నాయాలు జరగటం లేదు? మనిషిని ఇంకో మనిషి దోసుకొని తింటున్నాడు. అవుననుకో. కానీ, ఈయాల... ఇది నాయం కాదు. కూలి సేసుకుని బతికేవాడి పొట్టగొడితే సచ్చి సొర్గంలో వుండే అమ్మ మెచ్చదు. ఆడూ ఆడి తల్లి సివరిసూపు అందుకోబోతున్నాడు. ఇది పాపకారం. వాడి డబ్బు వాడికిచ్చెయ్యాలి.

మరి... ఈ పిల్లగాడేడీ? ఆడీపాటికి వప్పుచెక్కా, వునుగులు కొనుక్కుని వంపుకాడ నీలు తాగుతుంటాడు టేషన్లో.

సరే... మిగతా డబ్బులిచ్చేద్దాం. ఆడు ఈపాటికి లేసుండడు. సిన్నగా వాడి పక్కలో జారిడుద్దా... ఏమో! మేలుకు పోతే కీడు ఎనకాలే వత్తదంట. పోలీసులకు పట్టిత్తే? పట్టిత్తేమానా? మనకేమన్నా కొత్తా? నాయంగా మాట్టాడితే ఈ సొమ్ము ఆడిదేగా. ఆడి సొమ్ము ఆడికియ్యటానికి ఎనకాడటమెందుకు?

టేషన్లో గంట గొడతన్నారు. అదే హైద్రాబాద్ బండికేనా? కాలు సాగిద్దాం. వాడు లెగవకముందే ఆడ పారేద్దాం.

ఎర్రటోపీలు! బుకింగు దగ్గర నిలబడటానికా? బుకింగు దగ్గరకైతే ఒక్కడు సాలు... మరి? మనకోసం కాదుగదా? ఏమో సూద్దాం. వాళ్లంతా గుంపుగా ఏం చేత్తన్నారు?-ఆ బెంచిసుట్టూ? ఆడు నిద్రలేసి ఏడుత్తన్నాడు. పైపంచతో కళ్లు తుడుసుకుంటున్నాడు.

ఆడు నన్ను గుర్తుబట్టాడా? లేదులే... ఇప్పుడెట్టా? ఆ పోలీసోడు. మోకాలిమీద బొక్కుపెట్టి రాసుకుంటున్నాడు. ఆ గుంపు ఎనకమాల నిలబడదాం.

సారల పైజమా... మాసిన ఎర్రసొక్కా-ఎర్రగా బొద్దుగా వున్నాడు. పోలీసోళ్లకు గుర్తులు సెబుతున్నాడు. సిన్నపిల్లగాడిలాగా ఏడుత్తున్నాడు. వాళ్లమ్మను సూడలేనని మరికాత్త గుండె బేజారిపోయింది పాపం!

ఆడు నన్ను గుర్తుబట్టాడు.

ఇటొత్తన్నాడు.

"ఇదిగో!"

పర్సు ఊడదీసి సూసుకుంటున్నాడు-టికెట్టు వాడి పాణం లేసొచ్చింది. రశీదు-ఉత్తరం-రెండు మాసిన రెండురూపాయల నోట్లుమిగలావి?

మొకం నల్లబడిపోయింది. రూపాయినోటు, సిల్లర సెబుదాం.

"కరుసుబెట్టుకున్నాను!"

కాలరు గట్టిగా పట్టుకొన్నార్రా! "పద టేషన్కి నడవరా!" పారిపోతాననుకున్నారు.

బొక్కలో తోత్తారంట-మనకేమన్నా కొత్తనా?

"అబ్బ!"-లాటీకర్రతో డొక్కలో పొడిశార్రా! పొద్దున్నేలేసి ఎవురి మొహం సూశానో!

■